చేయూతనిస్తూ... అండగా నిలుస్తూ...

- బీసీ ఉద్యోగుల సంఘం ప్రస్థానం
- 1997 నుంచి నిర్విరామంగా సేవ



ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

మామిడికుదురు: ఉద్యోగాలు చేస్తున్న వారు తమ స్వలాభం చూసుకోకుండా సంఘీయులకు అండగా నిలుస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండున్నర దశాబ్దాలకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మామిడికుదురు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 1997లో ప్రారంభమైంది. ఈ సంఘం దిన దిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ సేవా కార్యక్రమాలను విస్తరిస్తోంది. నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా సంఘీయులకు చేయూతనందిస్తోంది. ఈ సంఘం ద్వారా ఇంత వరకు రూ.25 లక్షలకు పైగా సేవా కార్యక్రమాలకు వినియోగించారు. ఏటా జనవరి 26న క్రమం తప్పకుండా సంఘం వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలోనే మండల పరిధిలోని 12 ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న బీసీ విద్యార్థుల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.రెండు వేల నగదు ప్రోత్సాహంతో పాటు షీల్డులు అందించి వారిని ప్రోత్సహిస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో మొదటి స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఇదే తరహాలో నగదు ప్రోత్సాహాలతో సత్కరిస్తున్నారు.

మూడేళ్ల నుంచి కెరీర్ గైడెన్స్ సేవలు

మూడేళ్ల నుంచి కులంతో సంబంధం లేకుండా కెరీర్ గైడెన్స్ ద్వారా విద్యార్థులకు సంక్షేమ సంఘం బాసటగా నిలుస్తోంది. ఏపీఆర్జేసీ, పాలిటెక్నిక్, స్పోకెన్ ఇంగ్లిష్‌తో సహా సమ్మర్ క్లాసుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తున్నారు. ఈ విధంగా ఇతర కులాల వారిని కూడా ప్రోత్సహిస్తున్నారు. దీంతో పాటు ఉద్యోగ విరమణ పొందిన బీసీ ఉద్యోగులతో పాటు అవార్డులు అందుకున్న వారికి సైతం సంఘం ద్వారా సన్మానించి వారిని మరింతగా ప్రోత్సహిస్తున్నారు. దీంతో పాటు బీసీ ఉద్యోగుల్లో ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నా వారికి సైతం మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. ఈ తరహాలో పలు సేవా కార్యక్రమాల ద్వారా సంఘం ప్రశంసలందుకుంటోంది.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే..



ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మా సంఘం ద్వారా 27 ఏళ్ల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. బీసీ ఉద్యోగుల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నాం. సభ్యత్వ రుసుంతో పాటు దోనర్లు అందించే విరాళాల ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నాం.

– రాయుడు శ్రీనివాస్, సంఘం ప్రధాన కార్యదర్శి

బీసీలతో పాటు ఇతరులకు సహకారం



బీసీ కులాలతో పాటు ఇతర కులాల విద్యార్థులకు మా సంఘం అండగా నిలుస్తోంది. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి వారు ఉన్నతంగా చదువుకోవాలన్నదే మా సంఘం లక్ష్యం. అందుకే ఈ సంఘం ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం, అవార్డులు పొందిన వారికి సైతం సంఘం అండగా నిలుస్తోంది. మేము చేస్తున్న కార్యక్రమాలు యువతలో స్ఫూర్తిని నింపాలన్నదే మా లక్ష్యం.

– సైనాల రఘురామయ్య, సంఘం అధ్యక్షుడు

సేవలను మరింత విస్తరిస్తాం



బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సేవలను మరింత విస్తరించే దిశగా ముందుకు వెళ్తున్నాం. 2009లో జిల్లా సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఈ సంఘం ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇటీవల వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆరు మండలాల్లో విద్యార్థులకు పలు విభాగాల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చాం. సహచర ఉద్యోగుల సహకారంతో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నాం.

– గుబ్బల మురళీకృష్ణ, అంబేద్కర్ కోనసీమ జిల్లా సంఘం అధ్యక్షుడు

కార్యకర్తలకు అండగా ఉంటా



వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను కలసిన గొల్లపల్లి

రాజోలు: గ్రామస్థాయిలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ధైర్యం చెప్పాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా గొల్లపల్లి కలిశారు. జిల్లాలో ఎన్నికల ఫలితాల తర్వాత జరిగిన పరిణామాలపై చర్చించినట్టు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణ జగన్ వివరించారన్నారు. గొల్లపల్లి తనయుడు గొల్లపల్లి శ్రీధర్, మలికిపురం జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, కొల్లాబత్తుల కుమార్ తదితరులు పార్టీ అధినేత జగన్‌ను కలిశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

అంబాజీపేట: ఇటీవల కె.గంగవరం మండలం ఎర్రపోతవరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండవేసి అవమానపరిచి, సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని మండల ఎస్సీ నాయకులు డిమాండ్ చేశారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఆర్ఐ ఇబ్రహీంలకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం అందించారు. అంబేద్కర్ యువజన సంఘాల వారికి మహిళా పోలీసులు ఫోన్ చేసి మీ పరిధిలో ఉన్న విగ్రహాలను మీరే సంరక్షించుకోవాలని చెప్పడం బాధాకరమన్నారు. ఇలా చేయడం వల్ల మా మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. అంబేద్కర్ విగ్రహాలను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని, విగ్రహాలపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నెల్లి వెంకటరమణ, నూకపెయ్యి చిన్న, నాగాబత్తుల నరసింహమూర్తి, ఎన్.సూర్యనారాయణ, బీవీవీ సత్యనారాయణ, గోసంగి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోమలతో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి



ముక్కామలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: దోమలతో మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వైద్య చికిత్స పొందాలని వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ముక్కామలలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రావతి మాట్లాడుతూ మనకు హాని చేసే దోమలైన మలేరియా కారక దోమ అనాఫిలిస్, డెంగీ కారక దోమ ఎడిస్ ఇళ్లలో ఉండే నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ఆచరించాలన్నారు. జ్వరం, చలి, వణుకు, చెమట పట్టడం మొదలగు లక్షణాలు ఉంటే సమీప ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలన్నారు. ఆయా కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ ర్యాలీలో సీహెచ్ఓ రవికుమార్, ఎస్‌యుఓ రాజబాబు, ఎంపీహెచ్ఎస్ రాధా నరసింహం, హెచ్ఏ ప్రసాద్‌బాబు, ఎల్‌టీ పల్లంశెట్టి, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు మేనేజర్‌గా జయరాం



కెనరా బ్యాంకు మేనేజర్‌ను అభినందిస్తున్న గోపాలకృష్ణంరాజు

మలికిపురం: మండలంలోని లక్కవరం కెనరా బ్యాంక్ నూతన మేనేజర్‌గా రాజా జయరాం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాదు నుంచి బదిలీపై వచ్చి విధుల్లో చేరిన ఆయనను లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, లక్కవరంలో కెనరా బ్యాంక్ వ్యవస్థాపకుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, ఖాతాదారులు బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం గోపాలకృష్ణ రాజు మాట్లాడుతూ మీ హయాంలో స్టాఫ్ సహకారంతో బ్యాంక్ మరింత అభివృద్ధి చెందాలని, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు.

పశువుల ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



పినపళ్లలోని పశువుల ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీడీఓ మూర్తి

ఆలమూరు: మండలంలోని పినపళ్లలోని పశువుల ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ మంగళవారం జరిగింది. జిల్లా పశుసంవర్ధకశాఖ డీడీఓ కర్నీడి మూర్తి విచ్చేసి ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. పశువులకు అందుతున్న సేవలను స్థానిక పాడి రైతులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి దృష్ట్యా పాడి పశువులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఈదల శ్రీనివాసును కోరారు. ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రతపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

బకాయిలు చెల్లించాలని కౌలు రైతుల ధర్నా



మామిడికుదురులో ధర్నా చేస్తున్న కౌలు రైతులు

మామిడికుదురు: రైతుల నుంచి కొనుగోలు చేసిన రబీ పంటకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కౌలు రైతులు మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు నిధులు జమ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సార్వా సాగుకు జాప్యం జరుగుతుందని, ఇంత వరకు పంట పొలాల్లోకి సాగునీరు రాలేదన్నారు. పదేళ్ల క్రితం ఏప్రిల్ 15న సాగునీరు విడుదల నిలిపి వేసి, మే 15వ తేదీ నాటికి కాలువలకు సాగునీరు విడుదల చేసేవారని గుర్తు చేశారు. ఈ విధానం వల్ల సార్వాతో పాటు దాళ్వా, అపరాలు సాగు చేసుకునే వెసులుబాటు రైతులకు ఉండేదన్నారు. కానీ నేడు ఆ పరిస్థితులు లేవని ఆవేదన చెందారు. భవిష్యత్‌లో పూర్వపు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంట కాలువలను, మురుగు కాలువలను బాగు చేయాలని, కౌలు రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని కౌలు రైతులు డిమాండ్ చేశారు. ధర్నాలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు అప్పారి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, తాటికాయల ఉదయభాస్కర్, రాయుడు ఆనందరావు, పి.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరావు, సత్తి ధర్మారావు, బళ్ల పర్వతాలు, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయ ప్రాంగణంలో మురళీ కోలాటం



అంతర్వేది ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మురళీ కోలాటంలో కళాకారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉండికి చెందిన మహిళా కళాకారులు మురళీ కోలాటం, భరతనాట్యం చేశారు.

నల్లా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినిధి నల్లా ప్రసాద్ నిర్వహించారు. లక్ష్మీనృసింహునిపై భక్తి గీతాలు ఆలపిస్తూ కళాకారులు చేసిన కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది కళాకారులకు చిరు సత్కారాలు చేశారు.

మిరాకిల్ బుక్‌లో కృష్ణవంశీకి చోటు



పెద్దింటి కృష్ణవంశీ

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన పెద్దింటి కృష్ణవంశీ మిరాకిల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కాడు. వంశీ చిన్న వయసు నుంచే ఓ పక్క చదువుతూ మరో పక్క వివిధ ప్రయోగాలు ముఖ్యంగా సుద్దముక్క, పెన్సిల్ ముల్లు, సబ్బుబిళ్ల తదితర వాటిపై బొమ్మలు చెక్కడం, విద్యుత్ బల్బులో అగ్గిపెట్టెలు, దేవాలయం, ఎర్రకోట, ఇండియా గేట్, బొమ్మలు అమర్చడం, బియ్యపు గింజలపై జాతీయ జెండా రంగులు అద్దడం, వంటి ప్రయోగాలు చేశాడు. అనేక రికార్డులు సాధించాడు. సినిమా రంగంపై మక్కువతో ఆ రంగంలో ప్రవేశించి కొత్తరంగుల ప్రపంచం, మాత్ర, సిరాతో పాటు మరో 3 సినిమాల్లో నటించాడు. తన ప్రతిభను గుర్తించి మిరాకిల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసినట్టు ఆ సంస్థ అధినేత టి.రవీంద్ర ధ్రువీకరణ పత్రం పంపినట్టు వంశీ తెలిపారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల పెంపునకు కృషి చేయాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించడంతో పాటు ప్రసవాల సంఖ్య పెంపుకు ప్రత్యేక కృషి చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా గ్రామాల పీహెచ్‌సీలలో మంగళవారం వైద్యారోగ్య, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆగస్టు నెలలో సాధించవలసిన ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

పశువులకు గొంతు వాపు వ్యాధి టీకాలు

అంబాజీపేట: పశువుల్లో గొంతు వాపు వ్యాధి నివారణకు ముందు జాగ్రత్త చర్యలతో టీకాలు వేయడం ప్రారంభించినట్లు మండల పశు వైద్యాధికారులు డి.రాజేంద్రప్రసాద్, జి.శ్రీనివాస్, వి.దీపిక అన్నారు. గంగలకుర్రు అగ్రహారం, ఇరుసుమండ, పసుపల్లి గ్రామాల్లో పశువులకు టీకాలను మంగళవారం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తేమ అధికంగా ఉండే ప్రాంతాల్లో వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. కళ్లు ఎర్రబడటం, నీరు కారడం, నోటి నుంచి సొంగ కారడం, గొంతు కింద భాగంలో నొప్పులతో కూడిన వాపులు కలిగిన లక్షణాలుంటే గొంతు వాపు వ్యాధి సంక్రమించినట్లేనన్నారు. వ్యాధి సోకిన పశువులు ఆహారం సక్రమంగా తీసుకోవని, వ్యాధి నిరోధక శక్తి పడిపోతుందన్నారు. సరైన వైద్యం అందకపోతే వ్యాధి సోకిన పశువు 48 గంటల్లో చనిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే గంగలకుర్రు అగ్రహారంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మేకలకు, గొర్రెలకు చిటిక వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేశారు.

కంటి వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్య బృందం ఈసందర్భంగా 78 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 20 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించినట్టు కార్యక్రమానికి ఆధ్వర్యం వహించిన హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి



అంబాజీపేటలో కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

అంబాజీపేట: ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులతో పాటు కూటమి పార్టీ నాయకులను కలుపుకుంటూ నియోజకవర్గ కో ఆర్డినేషన్ కమిటీ సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు అన్నారు. అంబాజీపేటలో వెంకటరాజు ఆయిల్ మిల్ వద్ద పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కో ఆర్డినేషన్ కమిటీని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, కార్యదర్శి లోకేష్ నియమించారన్నారు. నరేంద్ర మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ఆదేశాల మేరకు అమలాపురం ఎంపీగా గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యేగా గిడ్డి సత్యనారాయణలు విజయం సాధించారని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో కో కన్వీనర్లు దాసరి వీవీ సత్యనారాయణ, మోకా ఆనందసాగర్, గణపతి వీరరాఘవులు, గుడాల ఫణి, రవణం రాము, దంతులూరి శ్రీనురాజు, తోలేటి సత్యనారాయణ, చిట్టూరి శ్రీనివాసరావు, అక్కల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్కతో ఇక్కట్లు



జొన్నాడ పంటకాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ఆలమూరు: పంట కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క కారణంగా పంట పొలాలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ (తొలకరి పంట) సీజన్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో సాగునీరు సక్రమంగా పారకపోవడం రైతుల పాలిట శాపంగా పరిణమించింది. ఇరిగేషన్ అధికారులకు పంట కాలువల దుస్థితిని తీసుకువెళ్లినా పట్టించుకోకుండా పంటకాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలు పంట కాలువలతో పాటుగా ముఖ్యంగా జొన్నాడ నుంచి కొత్తూరు సెంటర్ చేరుకునే కాలువగట్టు వెంబడి ఉన్న ప్రధాన పంట కాలువల్లో చెత్తా చెదారాలు పేరుకుపోయి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే పరిస్థితులు లేకుండా పోయాయి. పంట కాలువల్లో పెద్ద ఎత్తున్న గుర్రపుడెక్క, పచ్చగడ్డి పేరుకుపోయి నీరు దిగే మార్గాలు మూసుకుపోయాయి. అంతే కాకుండా రాబోయే వర్షాకాలంలో పంట కాలువలు ముంపునకు గురైతే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌తో పాటు అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి సాగు నీరు సక్రమంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీఎం ప్రమాణ స్వీకార వీక్షణకు స్క్రీన్ల ఏర్పాటు

కొత్తపేట: నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు మండలాల్లో ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ పర్యవేక్షణలో మండల కేంద్రాల్లో తహసీల్దార్ల ఆధ్వర్యంలో వివిధ ఏర్పాట్లు చేసినట్టు స్థానిక అధికారులు తెలిపారు. ప్రమాణస్వీకారానికి ఔత్సాహికులను తరలించేందుకు జిల్లాలో ప్రతి నియోజకవర్గం నుంచీ 4 బస్సులు ఏర్పాటు చేశారు. ఈ కసరత్తును తహసీల్దార్లు పర్యవేక్షించారు. ఆ విధంగా నియోజకవర్గంలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల నుంచి బుధవారం తెల్లవారుజామున ఒక్కో బస్సులో టీడీపీ శ్రేణులు, ఔత్సాహికులను తరలించనున్నారు. మండల కేంద్రంలో విశాలమైన ఫంక్షన్ హాలులో ప్రమాణ స్వీకారం ప్రజలు వీక్షించేలా భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

ఘనంగా గ్రామ దేవత జాతర

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం పంచాయతీ శివారు ఆదిలక్ష్మీపురంలో వేంచేసి ఉన్న ఆదిలక్ష్మి అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి, నైవేద్యాలు చెల్లించి తీర్థం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా క్రీడా మైదానం



సిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో తాగి పడేసిన మద్యం సీసాలు

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. క్రీడా మైదానానికి చుట్టు పక్కల రక్షణగోడలు, ఇనుపగేట్లు గతంలో ఏర్పాటు చేశారు. అయితే ఇవి పాతపడి తుప్పపట్టి శిథిలమవడంతో ఆ క్రీడా ప్రాంగణంలో రాత్రి సమయంలో మద్యం తాగేందుకు కొందరూ ఆకతాయిలు ఉపయోగిస్తున్నారు. అలా వారు తాగి పడేసిన మద్యం బాటిళ్లను పగలగొట్టి ఆ సీసాల పెంకులను క్రీడ మైదానం అటు ఇటు విసిరి పడేయంతో విద్యార్థులకు ప్రమాదం ఏర్పడే స్థితి ఉంది. ఈ క్రీడా మైదానానికి పాడైన రక్షణగోడలు, గేట్లను పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

22న వీరేశ్వరస్వామి భూముల లీజుకు వేలం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవపురం గ్రామంలో వేంచేసియున్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి భూముల లీజుకు సంబంధించి ఈ నెల 22వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కొండవీటి శివరామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరంగి పంచాయతీ పరిధిలోని బొడ్డువానిలంక, తాళ్లరేవు కేశవపురం గ్రామంలో ఉన్న భూములకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని, ఇతర వివరాలకు స్థానిక ఆలయంలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట: అంబాజీపేట వీరభద్ర థియేటర్ సమీపాన వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారి 29వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు మాచరి వెంకట్రాజు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, గణపతి పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేకువజాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఏపీఈఏపీ సెట్‌లో పలువురికి ర్యాంకులు



అరిగెల సాయిరాధ హరిప్రియకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు



వరదా షహాంత్



షేక్ అమీనా సుల్తానా



బాలం సాయిదుర్గా మహేష్



కటికిరెడ్డి సంజయ్ పవన్



వెంకట దుర్గా సాయి



యెలిశెట్టి శ్రీరామకార్తిక్

మామిడికుదురు/పి.గన్నవరం/ఆత్రేయపురం/అంబాజీపేట/కొత్తపేట: ఏపీఈఏపీ సెట్‌లో మామిడికుదురు మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. మామిడికుదురుకు చెందిన వరదా షహాంత్ 187వ ర్యాంకు, మొగలికుదురుకు చెందిన షేక్ అమీనా సుల్తానా 477వ ర్యాంకు, మామిడికుదురుకు చెందిన బాల సాయిదుర్గా మహేశ్ 523వ ర్యాంకు సాధించారు. పి.గన్నవరం మండలం జి.పెదపూడి శివారు బూరుగులంకకు చెందిన కటికిరెడ్డి సంజయ్ పవన్ ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 185వ ర్యాంకు సాధించాడు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామానికి చెందిన గుండుబోగుల వెంకట దుర్గ సాయి రాష్ట్ర స్థాయిలో 240వ ర్యాంకు సాధించాడు.

కొత్తపేట కృష్ణమూర్తి వీధికి చెందిన యెలిశెట్టి శ్రీరామకార్తిక్ 444వ ర్యాంక్ సాధించాడు. అంబాజీపేట మండలం మాచవరం అగ్రహారానికి చెందిన అరిగెల సాయిరాధ హరిప్రియ అగ్రికల్చర్ విభాగంలో 251 ర్యాంకు సాధించింది. హరిప్రియ గతంలో విడుదలైన నీట్ ఫలితాల్లో 620వ ర్యాంకు సాధించి గ్రామానికే వన్నె తెచ్చింది. అగ్రికల్చర్‌లో మంచి ర్యాంకు వచ్చినప్పటికీ తాను డాక్టర్ కావడమే లక్ష్యమని పేర్కొంది. తాతయ్య, నానమ్మల ఆకాంక్షతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఈ ర్యాంకులను సాధించానంది.

కవి నల్లాకు శ్రీరామ భక్త హనుమాన్ పురస్కారం

అమలాపురం టౌన్: చిత్తూరు జిల్లా గొల్ల చీమలపల్లి బైరెడ్డిపల్లి మండలానికి చెందిన సాంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ, తిరుపతి ఏఎస్ ఫౌండేషన్ సంయుక్తంగా అమలాపురానికి చెందిన కవి, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తికి శ్రీరామ భక్త హనుమాన్-2024 పురస్కారానికి ఎంపిక చేశాయి. సాంప్రదాయ కళలు, కవిత్వానికి విశిష్ట సేవలు అందిస్తున్నందుకు కవి నల్లాను ఈ పురస్కారం వరించింది. ఈ నెల 16వ తేదీన చిత్తూరు జిల్లా పలమనేరులోని ఏపీసీ ఫంక్షన్ హాలులో నిర్వహించే పురస్కారాల ప్రదానోత్సవ సభలో కవి నల్లాకు ఈ పురస్కారాన్ని అందించనున్నారు. ఈ సందర్భంగా కవి నల్లాను పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు అభినందించారు.